క్లుప్తంగా

పిఠాపురంలో ఆయ్ చిత్రం యూనిట్ సందడి


గొల్లప్రోలులో ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సందడి చేస్తున్న ఆయ్ చిత్రం యూనిట్ సభ్యులు

పిఠాపురం: గ్రామంలో ఆయ్ చిత్రం యూనిట్ సందడి చేశారు. గొల్లప్రోలులో సోమవారం సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించిన సినిమా యూనిట్ టీజర్‌ను ఆవిష్కరించారు. తొలుత పిఠాపురం నియోజకవర్గం ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉమా కుక్కుటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈ సినిమా ఈ నెల 15వ తేదీన విడుదల కానుందని, అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కామెడీ ఎంటర్‌టైన్మెంట్‌తో తీసిన ఈ చిత్రాన్ని ఆదరించాలని సినిమా అఖండ విజయం సాధించాలని కోరుకుంటున్నట్టు హీరో నితిన్, ప్రొడ్యూసర్ బన్నీ వాసు తెలిపారు. ఈ ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన

కొత్తపల్లి: మూలపేటలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం విద్యార్థులు, మహిళ, బాలల చట్టాలపై సెక్టార్ సూపర్ వైజర్ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. బాల్య వివాహాలు అరికట్టడంపై ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ కమ్యూనిటీ సోషల్ వర్కర్ అనిత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కరప: పెనుగుదురు వంతెన వద్ద ఇరిగేషన్ భూమిని అధికార కూటమి నాయకుడొకరు ఆక్రమించినట్టు ఆ గ్రామస్తులు, రైతులు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేఎంజీ కెనాల్ పరిధిలో వేల ఎకరాల పొలాలున్నాయి. ఈ పంట కాలువకు, ఓ మాజీ సర్పంచ్ భూమికి మధ్య సుమారు వెయ్యి గజాల ఇరిగేషన్ భూమి ఉంది. గతంలో ఈ భూమిని కొందరు కబ్జా చేయగా, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కరప రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించారు. అప్పట్నుంచి ఖాళీగా ఉన్న విలువైన ఈ ఇరిగేషన్ స్థలాన్ని అధికార కూటమికి చెందిన కొందరు నాయకులు ఆక్రమించుకుని ప్రహరీ నిర్మించారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రూ కోట్ల విలువైన ఇరిగేషన్ భూమిని కబ్జాదారుల చెర నుంచి విడిపించాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో గ్రామస్తులు, రైతులు పేర్కొన్నారు. అలాగే పెనుగుదురులో నంబర్-1 తూరను, కాలువను మూసివేసి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన లేఅవుట్‌లో కలిపేసుకున్నాడు. దానివల్ల సాగు నీరందక రైతులకు ఇబ్బందికరంగా మారింది. పెనుగుదురు గ్రామంలోకి వెళ్లే రహదారిలో సుమారుగా 20 సెంట్ల పంచాయతీ భూమిని కూడా లేఅవుట్‌లో కలిపేసుకుని, విక్రయాలు చేసేశారు. ఆయా ఆక్రమణలపై పంచాయతీ, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, వీటిపై విచారణ జరిపి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌రు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన తుమ్మలపల్లి వీరబాబు, గ్రామస్తులు, రైతుల నుంచి సంతకాలు సేకరించి పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ అదృశ్యం

తొండంగి: జి.ముసలయ్యపేట గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ వాకా లలిత అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి పోలీసులు సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యు.కొత్తపల్లి మండల అమరవల్లి గ్రామానికి చెందిన లలిత(26) ఈనెల మూడో తేదీన యథావిధిగా జీ ముసలయ్యపేట గ్రామ సచివాలయానికి విధులకు హాజరైంది. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి బయలు దేరింది. కానీ ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కన్నీటి గాథ..!

- నిండా ముంచేస్తోంది
- నీట మునుగుతున్న వీధులు
- వర్షం వచ్చినా, నీరు విడుదల చేసినా తప్పని ఇబ్బందులు
- ఏలేరు కాలువ ముంపుతో పిఠాపురం పట్టణ ప్రజల కష్టాలు

పిఠాపురం: పంటలు పండించాల్సిన నీరు పట్టణాన్ని ముంచేస్తోంది. అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఏలేరు కాలువ పొంగిపొర్లుతూ పిఠాపురం పట్టణానికి ప్రాణ సంకటంగా మారింది. పిఠాపురం నడిబొడ్డున ఉన్న ఏలేరు కాలువ ముంపు బారిన పడి పట్టణ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఏళ్ల తరబడి కాలువ అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఏటా వరద నీటి ప్రవాహంలో పట్టణ ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. పొంగిపొర్లిన నీరు బయటకు పోయే మార్గాలు లేకపోవడం, డ్రైన్లు అస్తవ్యస్థంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏలేరులో నీరు వదిలితే..

ఏలేరు ప్రాజెక్టులో నీరు వదిలితే చాలు పిఠాపురం పట్టణం ముంపు బారిన పడుతోంది. కేవలం 400 క్యూసెక్కుల నీరు వదిలినా వీధులను ముంచెత్తుతోంది. పట్టణంలోని ఈవన్ నగర్, విద్యుత్ నగర్, ఆదిత్య స్కూలు ఏరియా, మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, మంగయ్యమ్మరావుపేట, బొజ్జావారితోట తదితర ప్రాంతాలు నీట మునుగుతున్నాయి.

కాలువ మూసుకుపోయి..

పట్టణంలో పేరుకుపోతున్న చెత్తా చెదారంతో ఏలేరు కాలువ మూసుకుపోయి.. నీరు విడుదల చేసినప్పుడల్లా పట్టణంలోకి పొంగి పొర్లుతోంది. వీధులన్నీ జలమయం అవుతుండడంతో ఆయా ప్రాంతాల ప్రజల ఇళ్లు చుట్టూ మురుగు పేరుకుపోతోంది. దీంతో కాలు కూడా బయటపెట్టలేని దుస్థితి నెలకొంటోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. చెరుకుల కాలువగా పిలవబడే ఏలేరు కాలువ పలుచోట్ల మూసుకుపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. కాలువలో చెత్తను తొలగించి కాలువను అభివృద్ధి చేయనంత కాలం ఇదే పరిస్థితి కొనసాగుతుంది.


సీతయ్యగారితోట ఏరియాలో వరద నీటిలో విద్యార్థుల ఇక్కట్లు


ఏలేరు కాలువ పొంగిపొర్లడంతో నీట మునిగిన పిఠాపురంలో వీధులు

నరకం చూస్తున్నాం



వర్షం వస్తే వీధుల్లోకి నీరు రావడం సహజం. కానీ మాకు ఎక్కడ వర్షాలు కురిసినా ఇక్కడ మా వీధులు నీట మునుగుతాయి. ఇదేం దారుణమో అధికారులే చెప్పాలి. ఏటా ఇలా ముంపు బారిన పడుతున్నా పరిష్కార చర్యలు తీసుకోవడం లేదు. మా వీధులన్నీ నీట మునగడంతో బయటకు వచ్చే పరిస్థితి లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ఎన్ని సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోడం లేదు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోండి.

– నాని, విద్యుత్‌గర్, పిఠాపురం

ఏటా ఇదే ఇబ్బంది



ఎన్ని సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. మా ఇళ్ల ముందు నీరు నిలిచిపోవడం వల్ల క్రిమికీటకాలతో పాటు, విష సర్పాలు ఇళ్లల్లోకి వస్తున్నాయి. వీటితో పాటు అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. అందరం భయభ్రాంతులకు గురవుతున్నాం. ప్రతి ఏటా వర్షా కాలం, ఏలేరుకు నీరు వదిలిన ప్రతిసారీ మాకు ఈ ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు తగిన చర్యలు తీసుకోకపోతే ఇళ్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితి వస్తోంది.

– బి.గంగరాజు, సీతయ్యగారితోట, పిఠాపురం

చర్యలు తీసుకుంటున్నాం



ఏలేరు కాలువ ముంపుపై చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడెక్కడ కాలువ దెబ్బతిన్నది పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. శాశ్వత నివారణ చర్యలు తీసుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కాలువపై ఉన్న వంతెనల వద్ద చెత్త అడ్డుగా ఉండి నీరు వెళ్లే మార్గం లేక నీరు పొంగిపొర్లుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. అలాంటి ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తం చేసి, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– కనకారావు, మున్సిపల్ కమిషనర్, పిఠాపురం

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. శ్రావణ మాసం ప్రారంభంలోనే తొలి సోమవారం రావడంతో భక్తులు తెల్లవారుజాము నుంచి బారులు తీరారు. తెల్లవారుజామున పిఠాపురం మహారాజా గోత్రనామాలతో స్వామివారికి తొలి పూజ, తొలి అభిషేకం నిర్వహించారు. వీటిని తిలకించడానికి భక్తులు వేచిఉన్నారు. స్వామి వారికి ప్రీతైన రోజుతో పాటు, శివుడు అభిషేక ప్రియుడు కావడంతో ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి ఆలయ పుష్కరణిలో నీటితోను, పాలతోను భక్తులు అభిషేకాలు చేశారు. ఆలయంలోని ఉప ఆలయాలు, మూలవిరాట్, స్వామివారిని, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, సన్నిధిరాజు వెంకన్న, వేమూరి చంటి, అళ్లకి రాజ్ గోపాల్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. దేవస్థాన సిబ్బంది, భక్త సంఘ నాయకులు భక్తులకు సేవలందించారు.

లింగ నిర్ధారణ చేయడం నేరం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.సరిత


సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సరిత

సామర్లకోట: పుట్టబోయే బిడ్డ ఎవరనేది తెలుసుకోవాలన్న ఉద్దేశంతో లింగ నిర్ధారణ పరీక్ష చేయడం నేరమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.సరిత అన్నారు. సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జె సీతారామారావు ఆధ్వర్యంలో గర్భిణీ, శిశు లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లింగ నిర్ధారణ చేసే ఆస్పత్రి డాక్టర్లతో పాటు, పరీక్ష చేయించే తల్లిదండ్రులపైనా తీవ్ర చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. బాల బాలికలు ఎవరైనా ఒక్కటే అనే భావనతో వారిని ఆదరించాలని కోరారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని లేబరేటరీ నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఆడ పిల్లల నిష్పత్తిని పెంచాలన్నారు. గర్భంలో ఆడ పిల్లలుంటే అబార్షన్ చేయించే పద్ధతులకు స్వస్తి పలకాలన్నారు. ఆస్పత్రుల్లో సహజ ప్రసవాలకు సహకరించాలన్నారు. సబ్ డిస్ట్రిక్ లెవెల్ మల్టీ మెంబర్ ఆపరేట్ అథారిటీ కమిటీ సభ్యుడు కె.వెంకటాచలం, ఎన్‌జీఓ సభ్యురాలు పళ్ల వాసవి, డాక్టర్ ఎ.అనూషా రాయ్, డాక్టర్ పి.సత్య, డాక్టర్ ఎస్ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తొలి టీకా తల్లి పాలే..

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ ప్రవీణ


మాధవపట్నంలో చేస్తున్న సామూహిక సీమంతాలు

సామర్లకోట: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు మొదటి టీకాగా పని చేస్తుందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ ప్రవీణ అన్నారు. మండలంలోని మాధవపట్నం గ్రామంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఉషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రవీణ మాట్లాడుతూ, కనీసం ఆరు నెలల పాటు పిల్లలకు తల్లి పాలు ఇవ్వాలన్నారు. గర్భిణులు, బాలింతల్లో అవగాహన పెంచడానికి ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తల్లిపాలు బిడ్డలకు దివ్యౌషధంగా పని చేస్తుందన్నారు. బిడ్డకు తల్లి పాలిచ్చే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. నోడల్ అధికారి వై.లక్ష్మి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు స్వర్ణలత, విజయ, వీరలక్ష్మి, నిర్మల, చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం

కొత్తపల్లి: కొండెవరంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ చైల్డ్ రైట్స్ అడ్వకసీ సోషల్ వర్కర్ అనిత మాట్లాడుతూ మహిళలు తల్లి పాల ప్రాధాన్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు పట్టాలన్నారు. అనంతరం మహిళలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, సుధామాధురి, వెంకట దుర్గ, శాంతకుమారి, విజయకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

55.95 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు రోడ్డులోని ఓ ఇంటిలో నిల్వ ఉంచిన 55.95 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన కనకాల దుర్గారావు తూరంగిలో నివసిస్తూ, కొవ్వూరు రోడ్డులోని ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఎండీయూ వాహనాలు, బియ్యం లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి, ఇతర మిల్లులకు అమ్ముతుంటాడు. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని కొవ్వూరు రోడ్డులోని ఇంటిలో నిల్వ చేసినట్టు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. ఈ క్రమంలో అక్కడ దాడి చేసి, బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. మండల పౌర సరఫరాల అధికారి వి మమత బియ్యం అక్రమంగా నిల్వ చేసిన కనకాల దుర్గారావుపై 6ఏతో పాటు, క్రిమినల్ కేసును నమోదు చేశారు. ఈ బియ్యాన్ని సమీపంలో ఉన్న రేషన్ షాపునకు తరలించారు.

ఆరోగ్యవంతమైన పంటలు పండించాలి

- డీఆర్‌సీ డీడీఏ హరి
- విరవలో పొలంబడి కార్యక్రమం


విరవలో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

పిఠాపురం: రైతులు ఆరోగ్యవంతమైన పంటలు పండించాలని డీఆర్‌సీ డీడీఏ హరి రైతులకు సూచించారు. సోమవారం పిఠాపురం మండలం విరవలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఆరోగ్యవంతమైన పంటలను పండించాలని, మిత్ర పురుగులను కాపాడుకోవాలని, ప్రతి రోజు పొలంలో పరిసరాల విశ్లేషణ చేసుకొని అవసరమైన మేరకు మాత్రమే పురుగు మందుల పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకొని నాణ్యమైన అధిక దిగుబడి సాధించాలని ఆయన తెలిపారు. పిఠాపురం వ్యవసాయశాఖ ఏడీఏ స్వాతి మాట్లాడుతూ రసాయనిక వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా ప్రతి రైతు తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం విధానాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఎరువులు, పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా ఘన జీవమృతం, ద్రవజీవామృతం, వివిధ రకాల కషాయలతో పురుగులను, తెగుళ్లను నివరించుకోవచ్చని తద్వారా అధిక స్థాయిలో ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులకు బ్యాలెట్ బాక్స్ టెస్ట్ నిర్వహించారు. ప్రస్తుతం రైతు సేవ కేంద్రాల ద్వారా ఈ-పంట నమోదు జరుగుతుందని, సాగు చేసే ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ డీడీఏ మాధవి, పిఠాపురం ఏడీఏ స్వాతి, పిఠాపురం వ్యవసాయశాఖాధికారి ఎ.అచ్యుతారావు, సర్పంచ్ నడిగట్ల చింతలరావు, తమ్మనబోయిన అయ్యన్న, అమలకట్ట వీరబాబు, తమ్మనబోయిన నాగేశ్వరరావు, తమ్మనబోయిన అయ్యరాజు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి


కందరాడలో మొక్కలు నాటుతున్న నాయకులు

పిఠాపురం: మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి అంటూ సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల పద్మజ పిలుపునిచ్చారు. కందరాడలో పార్టీ మండల అధ్యక్షుడు పిల్లా ముత్యలరావు ఆధ్వర్యంలో ఆమె మొక్కలు నాటారు. ఈసందర్భంగా పద్మజ మాట్లాడుతూ మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడాలని అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఇంటి దగ్గర మొక్క నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో, జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, మండల మహిళా మోర్చా గండి రామతులసి, జనసేన నాయకురాలు పిల్లా సునీత, పి.చంద్రిక, ఎం.సత్యవేణి, సీనియర్ మాజీ నాయకులు తోట ఏడుకొండలు, కోకన్వీనర్ వాసంశెట్టి శ్రీనువాసు రావు, పిఠాపురం పట్టణ అధ్యక్షుడు పసుపులేటు సత్యనారాయణ, గొల్లప్రోలు పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు, మండలం అధ్యక్షుడు పోసిన సత్యనారాయణ పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు

– కమిషనర్ భావన

కాకినాడ: సకాలంలో రాకుండా, విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అన్నారు. పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా సోమవారం ఉదయం ఐదున్నర గంటలకు ఆమె నగరంలోని ఐదో సర్కిల్ పరిధిలోని మస్టర్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఏటిమొగ వెహికల్ యార్డ్, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఐదో సర్కిల్ పరిధిలో సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతున్నారో, లేదో ఆరా తీశారు. రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఎంత మంది వస్తున్నారు, విధులకు సకాలంలో హాజరుకాకపోయినా, గైర్హాజరైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఏటిమొగ వెహికల్ యార్డ్‌ను పరిశీలించారు. ఆమె వెంట, ఎంహెచ్‌ఓ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

శొంఠివారిపాకలలో అపరిశుభ్రత


శొంఠివారిపాకలలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త


ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్ వద్ద అధ్వానంగా ఉన్న మురుగు

కొత్తపల్లి: కొండెవరం శివారు శొంఠివారిపాకల గ్రామంలో అపరిశుభ్రత నెలకొంది. పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త, మురుగు దర్శనమిస్తోంది. ప్రధాన రహదారులు, ఆలయాలు వద్ద, డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. స్థానిక ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్ వద్ద చెత్త పేరుకుపోయింది. దుర్వాసన వెదజల్లడంతో విద్యార్థులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై అధికారులు చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గుంతలిలా.. వెళ్లేదెలా..!?

- అధ్వానంగా కాకినాడ దుమ్ములపేట-పోర్టు రోడ్డు
- పోర్టు సిబ్బంది, మత్స్యకారుల రాకపోకలకు కీలక మార్గం
- నిత్యం భారీ వాహనాల ప్రయాణం
- కనీస మరమ్మతులు చేపట్టని పాలకులు


కాకినాడ దుమ్ములపేట నుంచి పోర్టు రోడ్డులో రుచి ఆయిల్ పరిశ్రమ వద్ద దుస్థితి

కాకినాడ రూరల్: అభివృద్ధి లేదు.. రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటూ ఊక దంపుడు ప్రసంగాలు, సోషల్ మీడియాతో తప్పుడు ప్రచారాలు సాగించిన కూటమి పార్టీల నేతలు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా.. వారికి రోడ్ల గుంతలు కనిపించడం లేదు. రోడ్ల నిర్మాణం కంటే ముందుగా గుంతలు పూడ్చివేస్తామని ప్రకటించిన కూటమి నేతలు.. ఇప్పుడేమో చేతల్లో కాదు.. మాటలకే పరిమితమన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కనీసం ప్రజల ఇబ్బందులనూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు అధికారం కోసం.. అరచేతిలో వైకుంఠం చూపించిన కూటమి నేతలు.. ఇప్పుడు డబ్బుల్లేవు.. గల్లాపెట్టె ఖాళీ అంటూ కొత్త పల్లవి అందుకుంటున్నారు.

భారీ వర్షాలకు..

కాకినాడ జిల్లాకే తలమానికంగా నిలిచే పోర్టుకు వెళ్లే మార్గాలను కూడా పాలక ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. కాకినాడలో డెయిరీ ఫారమ్ సెంటరు మీదుగా దుమ్ములపేట నుంచి కుంభాభిషేకం రేవు, పోర్టు, సీ పోర్టులకు వెళ్లే కీలకమైన మార్గం గుంతలమయంగా మారింది. వర్షాలకు భారీ గుంతలు ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా దుమ్ములపేట, పర్లాపేట మత్స్యకారులతో పాటు, వివిధ కార్యకలాపాల కోసం పోర్టుకు వెళ్లే వారు, మెరైన్ పోలీసులు, పోర్టు అధికారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారు. దుమ్ములపేట, కుంభాభిషేకం మధ్య ఈ మార్గంలో రుచి ఆయిల్ ఫ్యాక్టరీతో పాటు, పలు గోడౌన్లు ఉన్నాయి. గోడౌన్లలో బియ్యం నిల్వ చేసేందుకు పోర్టుకు తరలించడం, పోర్టు నుంచి దిగుమతి చేసుకున్న ఇతర సరకులు గోడౌన్లకు చేరవేయడం కోసం భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి.

జనాలకు నిత్య నరకం

రోడ్డు మార్గాన్ని ఆనుకుని ఉన్న కాల్వలో మత్స్యకారులు తమ బోట్లు, తెప్పలను వేట అనంతరం లంగరు వేసి ప్రతి రోజూ రోడ్డుపై రాకపోకలు సాగిస్తారు. భారీ వాహనాల ప్రయాణం వల్ల గుంతల్లో బురద, రాళ్లు అటుగా వెళ్తున్న జనాలపై పడుతుండడంతో వారు గాయాల పాలవుతున్నారు. దీనికి తోడు చాలా మంది ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం రాకపోకలకు వీలు కాని విధంగా ఉన్న ఈ మార్గంలో గుంతలను తక్షణం పూడ్చి వేసి, వర్షాలు తగ్గిన తరువాత రోడ్డు నిర్మించాలని మత్స్యకారులు సహా, పలువురు కోరుతున్నారు.

ప్రమాదాలకు గురవుతున్నారు



దుమ్ములపేట నుంచి పోర్టు రోడ్డుకు వెళ్లే మార్గం గుంతలతో నిండిపోయింది. చాలా మంది ఈ మార్గంలో ప్రయాణాలు చేస్తున్నారు. గుంతల్లో చాలా మంది పడిపోతున్నారు. పలువురు గాయపడుతున్నారు. వెంటనే గుంతలు పూడ్చాలి.

– వాడమరిది బంగారి, మత్స్యకారుడు, పర్లాపేట, కాకినాడ


ఈ గుంతలను తప్పించుకుని వెళ్లడం నరకమే..

బాలికల పాఠశాలకు టాయ్‌లెట్ల అప్పగింత


పాఠశాలకు టాయ్‌లెట్లను అప్పగిస్తున్న సంస్థ ప్రతినిధులు


టాయ్‌లెట్లు ప్రారంభిస్తున్న దృశ్యం

సామర్లకోట: నెస్లే ఇండియా సీఆర్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రూ.ఐదు లక్షల వ్యయంతో మూడు టాయ్‌లెట్లను నిర్మించారు. విద్యార్థినుల కోసం నిర్మించిన వీటిని సోమవారం సాయంత్రం పాఠశాలకు అప్పగించారు. ఈ టాయ్‌లెట్లను సంస్థ మేనేజర్ వసీమ్ అహ్మద్ పరిశీలించారు. పాఠశాలలో ఉన్న 550 మంది విద్యార్థినులకు ఈ టాయ్‌లెట్లు ఎంతో ఉపయోగపడతాయని హెచ్‌ఎం మీనామాధురి తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పాలిక కుసుమ, మానవ హక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టాయ్‌లెట్ల ప్రారంభం

కొత్తపల్లి: మూలపేట జిల్లా పరిషత్ పాఠశాలలో నెస్లే సంస్థ ఏర్పాటు చేసిన టాయ్‌లెట్లను సోమవారం ప్రారంభించారు. సుమారు రూ.8లక్షలతో 5 శౌచాలయాలను ఏర్పాటు చేశారు. వీటిని గ్రామ సర్పంచ్ కంబాల మౌనిక ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ ఉమ, కంపెనీ కార్పొరేటివ్ మేనేజర్ వసీం అహ్మద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

7న ఖేలో ఇండియా రైజింగ్ స్టార్స్ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఖేలో ఇండియా రైజింగ్ స్టార్స్ క్రీడాకారుల ఎంపికను ఈ నెల 7న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్టు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎంపికైన వారికి యానాంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రెనింగ్ సెంటర్‌కు పంపుతారని చెప్పారు. 7న ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఎంపికల్లో అథ్లెటిక్స్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్‌లో బాలురు, బాలికల ఎంపికలు ఉంటాయన్నారు. వివరాలకు 89196 42248 నంబర్‌లో సంప్రదించాలన్నారు.